నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, బుధవారం 19 మార్చి 2025 | YADADRI BHUVANAGIRI

యాదగిరీశుడిని దర్శించుకున్న మిస్ వరల్డ్

యాదగిరిగుట్ట, మార్చి 18 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని మిస్ వరల్డ్ క్రిస్టినా పిస్కోవా దర్శించుకున్నారు. మంగళవారం ఉదయం చీరకట్టులో కొండపైకి చేరుకున్న ఆమె ముందుగా మాఢవీధుల్లోని ఈశాన్య ప్రాంతంలో గల అఖండజ్యోతికి మొక్కారు. గర్భగుడిలోకి వెళ్లి స్వయంభూ పంచ నారసింహస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు ఆమెకు సంప్రదాయ రీతిలో స్వాగతం పలికారు. ఆలయ ముఖ మండపంలో వేద ఆశీర్వచనం అందించారు. స్వామి లడ్డూ ప్రసాదం, చిత్రపటం, శేష వస్త్రాలను ఈఓ భాస్కర్‌రావు అందజేశారు.

యాదగిరిగుట్ట ఆలయంలో మిస్ వరల్డ్ క్రిస్టినా పిస్కోవా

బీఆర్ఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, పక్కన బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్య యాదవ్, ఒంటెద్దు నర్సింహారెడ్డి

ధైర్యంగా ఉండండి.. అండగా నేనున్నా

మీ కోసం పోరాడేందుకే వచ్చిన

- అన్నదాతలకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి భరోసా
- మండుటెండలో పెన్‌పహాడ్ మండలంలో ఎండిన పంటల పరిశీలన
- వందలాదిగా తరలివచ్చి గోడు వెల్లబోసుకున్న రైతులు
- అయ్యాల పొలాలు జాలువారితే.. ఇయ్యాల చుక్కనీరు లేదని ఆవేదన
- ఎకరాకు రూ.30వేలు పరిహారం ఇవ్వాలని గుంటకండ్ల డిమాండ్
- రైతుల కోసం మాట్లాడితే సస్పెండ్ చేశారని ఫైర్

సూర్యాపేట, మార్చి 18 (నమస్తే తెలంగాణ)/పెన్‌పహాడ్ : 'కండ్ల ఎదుట ఎండిన వరి చేలను చూసి దుఃఖంలో మునిగిన రైతులు ధైర్యంగా ఉండండి.. మీకు దన్నుగా నేనుంటా'నంటూ మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నదాతలకు భరోసానిచ్చారు. పెన్‌పహాడ్ మండలంలోని దుబ్బతండా, రేత్యాతండాల్లో వందల ఎకరాల్లో ఎండిపోయిన వరి పంటలను మంగళవారం మండుటెండలో ఆయన పరిశీలించారు. జగదీశ్‌రెడ్డి వస్తున్నారని తెలుసుకున్న గిరిజన రైతులు పెద్దఎత్తున చేరుకొని తమ గోడు వెల్లబోసుకున్నారు. కాంగ్రెస్‌ళ్లు ఎన్నికల్లో చెప్పినట్లు ఇస్తామన్నది ఒక్కటీ ఇవ్వకపోగా మీరిచ్చిన నీళ్లను కూడా మాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. నాడు పొలాల్లో నీళ్లు జాలువారితే ఇయ్యాల చుక్క నీరు లేక బోర్లు కూడా పోవడం లేదని వాపోయారు. పది ఎకరాలు ఉన్నా గింజ చేతికి రాకుండా ఎండిపోతున్నదని ఓ రైతు వేదన వ్యక్తం చేశారు.

నిఖార్సయిన ఉద్యమకారుడిని..

ఎండలు బాగా కొడుతుండడం వల్ల పంటలు ఎండిపోతున్నాయని, గతం కంటే రైతులు ఎక్కువ విస్తీర్ణంతో పంటలు సాగు చేయడం వల్ల నీళ్లు చాలడం లేదని కాంగ్రెస్‌ళ్లు కొత్త అబద్దాలు ఆడుతున్నారని, కేసీఆర్ హయాంలో ఎండలు లేవా? అని జగదీశ్‌రెడ్డి ప్రశ్నించారు. రైతు సమస్యలపై ప్రశ్నిస్తే వాస్తవాలు గిట్టని ప్రభుత్వం తనను బడ్జెట్ సమావేశాల నుంచి సస్పెండ్ చేసిందని తెలిపారు. తనను ఏదో భయపెట్టాలని చూశారని, జగదీశ్‌రెడ్డి భయపడే వ్యక్తి కాదని, నిరంతరం ప్రజల తరపున పోరాటం చేసే నిఖార్సయిన ఉద్యమకారుడిని అని స్పష్టం చేశారు. యావత్ ప్రభుత్వం కుట్ర చేసి తనను అసెంబ్లీ నుంచి బయటకు పంపిందని పేర్కొన్నారు. ఇయ్యాల ఊళ్లు కల తప్పాయని, జనం మొహంలో నవ్వు మాయమైందని ఆదందోళన వ్యక్తం చేశారు. ఎవరు ప్రశ్నిస్తే వారిపైన కేసులు పెట్టడం, నిర్బంధాలతో భయపెట్టడం కాంగ్రెస్ ప్రభుత్వం పనిగా పెట్టుకుందని మండిపడ్డారు. హామీల గురించి అడిగినా, ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడినా బట్టలిప్పి కొడుతానంటూ అసెంబ్లీ సాక్షిగా సీఎం హోదాలో రేవంత్‌రెడ్డి మాట్లాడడం దుర్మార్గమన్నారు. చివరకు బాధితుల గోడును ప్రసారం చేసే మీడియా ప్రతినిధులపైనా కేసులు పెట్టి జైలుకు పంపాడంటే ఏ స్థాయికి దిగజారాడో అర్థమవుతుందన్నారు. 'నీకు ప్రజల బట్టలిప్పి కొట్టే హక్కు లేదు.. 420 హామీలు, ఆరు గారెంటీలు అని రాసిచ్చి అమలు చేయకుండా బాకీ పడ్డందుకు ప్రజలకే నీ బట్టలిప్పి కొట్టే హక్కు ఉంది. ప్రజలను, రైతులను బాధ పెడుతున్నావు.. వారి ఉసురు తగులుంది' అంటూ హెచ్చరించారు. ఒక ప్రజా గొంతుకను నొక్కాలని ప్రయత్నిస్తే రాష్ట్రంలో లక్షల గొంతులు ప్రభుత్వంపై తిరిగుబాటు చేసేందుకు సిద్ధమవుతాయన్నారు.



పెన్‌పహాడ్ మండలం రేత్యా తండాలో ఎండిన వరి కంకులను మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డికి చూపించి గోడు వెల్లబోసుకుంటున్న రైతులు

300 బోర్లు వేసినా..

అసెంబ్లీలో రైతులకు రుణమాఫీ చేశాం.. రైతు బంధు ఇచ్చాం... వడ్లకు బోనస్ ఇచ్చాం అంటూ చెప్తున్నారు. ఎక్కడ ఇచ్చారు.. ఎవరికి ఇచ్చారో నిరూపించాలని అడిగితే అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేశారని జగదీశ్‌రెడ్డి చెప్పుకొచ్చారు. రాత్రికి రాత్రి ఏమన్నా ఇచ్చిండ్రా ఏందని మీ వద్దకు వచ్చిన అని తెలపడంతో.. 'ఎవడాడు మాకు ఇచ్చింది.. ఆనాడు కేసీఆర్ హయాంలో వచ్చినవి తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిందేం లేదు' అంటూ రైతులు తేల్చిచెప్పారు. నీళ్లు రాక పొలాలన్నీ ఎండిపోయాయని, మిగిలిన కొద్ది పాటి పంటలైనా కాపాడుకోవాలని ఒక్క రేత్యాతండా పరిధిలోనే దాదాపు 300 బోర్లు వేసినా, ఫలితం లేకుండా పోయిందని రైతులు తెలిపారు.

పెన్‌పహాడ్ మండలం రేత్యా తండాలో ఎండిన పొలంలో మేకలు మేపుతున్న మహిళా రైతు

ఇది కాంగ్రెస్ తెచ్చిన కరువు

ప్రస్తుత కరువు పరిస్థితులు కాంగ్రెస్ ప్రభుత్వ నిర్వాకంతో ఏర్పడినవేనని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి మండిపడ్డారు. ఎండిన పంటలను ఆయన చూపుతూ పలువురు రైతులు తమకు ఆత్మహత్యే శరణ్యమని నిస్సహాయ స్థితిని వ్యక్తం చేయగా.. 'అలాంటి పిచ్చి ఆలోచనలు చేయొద్దు.. ఈ సీజన్‌లో పంట పోయింది. మళ్లీ వచ్చే సీజన్ ఉంటుంది. అందరం కలిసి నీళ్లు ఎందుకు ఇవ్వరో పోరాడుదాం. ఎన్నో పోరాటాలు చేశాం.. పెద్దపెద్దోళ్లు అనుకున్న వాళ్లనే మట్టి కరిపించి తెలంగాణ రాష్ట్రం సాధించుకున్నాం.. ఇవ్వాల రేవంత్‌రెడ్డి లాంటి వాళ్లు ఒక లెక్కా! మీరు ధైర్యంగా ఉండండి.. నేను అండగా ఉంటా'నంటూ జగదీశ్‌రెడ్డి ధైర్యం చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టును తమకు అప్పగిస్తే మూడో రోజే పంట పొలాల్లోకి నీళ్లు తెస్తామని నెల కిందటే చెప్పినా.. కాంగ్రెస్ ప్రభుత్వం స్పందన లేకుండా పంటలను ఎండబెడుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎండిన ప్రతి ఎకరాకూ పరిహారంగా ప్రభుత్వం రూ.30వేలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట జడ్పీ మాజీ వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణగౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు దొంగరి యుగంధర్, మాజీ ఎంపీపీ నెమ్మాది భిక్షం, మాజీ జడ్పీటీసీ జీడి భిక్షం, సింగిల్ విండో చైర్మన్లు వెన్న సీతారాంరెడ్డి, నాతల జానకిరాంరెడ్డి, జిల్లా నాయకులు ఇంద్ర సేనారావు, వెంకటేశ్వర్లు, నాగేశ్వర్‌రావు, గోపి, శ్రీనివాస్, సుధాకర్, జగన్ ఉన్నారు.

నీళ్లులేక పంట మొత్తం ఎండి పోయింది

నాకున్న ఎనిమిదెకరాల్లో ఆరెకరాలు నాటు పెట్టిన. ప్రభుత్వం వార బందీ లెక్క నీళ్లు ఇస్తామంటే నమ్మి సాగు చేసిన. పంటకు సరిగా నీరందక పొలం నెర్రలిచ్చింది. పంట మొత్తం ఎండిపోయింది. రైతుబంధు పైసలు రాక పోవడంతో వ్యాపారుల వద్ద అప్పు తెచ్చిన. చేతికొచ్చిన పంట నీళ్లు లేక దక్కకుండా పోయింది. ఇక అప్పులే మిగిలాయి. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఎనిమిదెకరాలు సాగు చేస్తే మంచి దిగుబడి వచ్చింది. ఈ సారి మాత్రం ఆగమైంది.

-భూక్యా వెంకన్న, రైతు, మేగ్యతండా ఆవాసం, రేత్యాతండా, పెన్‌పహాడ్ మండలం

కేసీఆర్ సార్ ఉన్నప్పుడు గిట్ల లేకుండె

నేను నాలుగు ఎకరాల్లో వరి వేసిన. మొత్తం పిందె పోసుకుంది. ఇంకో రెండు తడులైతే పంట చేతికొచ్చేది. ఎస్సారెస్పీ కాల్వకు నీళ్లు రాక పంట మొత్తం ఎండి పోయింది. మా కష్టం ఎవలకు చెప్పుకోవల్నో అర్థమైత లేదు. మా ఊళ్ల 80 శాతం పంటలు నీళ్లు ఎండిపోయినయి. నీళ్లు ఇస్తరనే నమ్మకంతోనే పంటలు సాగు చేస్తే ప్రభుత్వం మోసం చేసింది. గతంలో కాల్వకు నీళ్లు వస్తే చెరువు నింపినం. దాని వల్ల బావులు, బోర్లల్లో నీళ్లు పెరిగినయి. అప్పుడు కరువన్న ముచ్చటే లేకుండే. ఐదు కిలోమీటర్ల నుంచి సొంత డబ్బులు పెట్టి కాల్వ తీపించినం. కానీ ఇప్పుడు కాల్వలో నీళ్లు రావడం లేదు.

-నునావత్ పద్మ, రైతు, దుబ్బ తండా, పెన్‌పహాడ్ మండలం

రేపు సూర్యాపేటలో కేటీఆర్ సమావేశం

- బీఆర్ఎస్ నాయకులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలి
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట టౌన్, మార్చి 18 : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈ నెల 20న సూర్యాపేటలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో నిర్వహించే సమావేశానికి పార్టీ ముఖ్య నాయకులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి పిలుపునిచ్చారు. తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆయన సూర్యాపేట, హుజూర్‌నగర్ నియోజకవర్గాల ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించి 25 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఏప్రిల్ 27న వరంగల్‌లో నిర్వహించే పార్టీ భారీ బహిరంగ సభతోపాటు ప్రజా సమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసేందుకు కార్యాచరణ రూపొందించనున్నట్లు చెప్పారు. వరంగల్ సభ విజయవంతానికి కేటీఆర్ సూర్యాపేటలో సన్నాహక సమావేశం నిర్వహించనున్నారని, బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, పార్టీ హుజూర్‌నగర్ నియోజకవర్గ సమన్వయకర్త ఒంటెద్దు నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రామన్నపేట : బీఆర్ఎస్ నాయకులను ముందస్తు అరెస్ట్ చేసిన పోలీసులు

ఓయూలో నిషేధాజ్ఞలపై భగ్గుమన్న విద్యార్థి లోకం

- ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ బీఆర్ఎస్‌వీ అసెంబ్లీ ముట్టడికి పిలుపు
- ఎక్కడికక్కడ అడ్డుకొని అరెస్ట్ చేసిన పోలీస్ యంత్రాంగం

సూర్యాపేట, మార్చి 18 (నమస్తే తెలంగాణ)/నల్లగొండ : ఉస్మానియా యూనివర్సిటీలో నిరసనలు, ర్యాలీలు, ఉద్యమాలు నిషేధిస్తూ ప్రభుత్వ ఆదేశానుసారం వీసీ చర్యలు తీసుకోవడంపై విద్యార్థిలోకం భగ్గుమన్నది. ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి వేదిక అయిన ఉస్మానియాలో ఇప్పటి వరకు కూడా నిషేధం పెట్టకపోగా, తొలిసారిగా రేవంత్ సర్కార్ తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ బీఆర్ఎస్‌వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా విద్యార్థులు అసెంబ్లీ ముట్టడికి బయల్దేరారు. కాగా పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకొని అరెస్ట్ చేశారు. ముందస్తుగానే ఆయా మండలాల్లో పోలీసులు గుర్తించి కట్టడి చేశారు. నల్లగొండలో బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మరబోయిన నాగార్జునతోపాటు రాష్ట్ర కార్యదర్శి చల్లా కోటేశ్ యాదవ్‌ను టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. దేవరకొండలో బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేముల రాజుతోపాటు మరికొంత మందిని అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మిర్యాలగూడలో బీఆర్ఎస్‌వీ రాష్ట్ర కార్యదర్శి ఎండీ షోయబ్, సంస్థాన్ నారాయణపురంలో బీఆర్ఎస్‌వీ మునుగోడు నియోజకవర్గ అధ్యక్షుడు నలపరాజు రమేశ్, చండూరులో బీఆర్ఎస్‌వీ మండల అధ్యక్షుడు పనస లింగస్వామి గౌడ్, త్రిపురారంలో బీఆర్ఎస్‌వీ నాయకుడు చాట్ల విజయ్, నకిరేకల్, నార్కట్‌పల్లి, పాలకవీడు, నేరేడుచర్ల, పెన్‌పహాడ్, మోత్కూరు, ఆలేరు, ఆత్మకూర్.ఎం మోటకొండూరు, బీబీనగర్, భూదాన్‌పోచంపల్లి మండలాల్లో బీఆర్ఎస్‌వీ నాయకులను అరెస్ట్ చేశారు.

ఆలేరు టౌన్ : పోలీస్ స్టేషన్‌లో బీఆర్ఎస్‌వీ నాయకులు

కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న అంగన్వాడీ టీచర్లు

రాష్ట్ర బడ్జెట్‌లో ఐసీడీఎస్‌కు కేటాయింపులు పెంచాలి

- ఎన్నికల హామీలు అమలు చేయాలి
- కలెక్టరేట్ వద్ద అంగన్వాడీల ధర్నా

భువనగిరి కలెక్టరేట్, మార్చి 18 : నేడు అసెంబ్లీలో ప్రవేశపెట్టే రాష్ట్ర బడ్జెట్‌లో ఐసీడీఎస్‌కు నిధులు పెంచాలని తెలంగాణ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోతరాజు జయలక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంగన్వాడీ సమస్యలపై ఉద్యోగులు చేపట్టిన 48 గంటల వంట వార్పు కార్యక్రమంలో భాగంగా మంగళవారం కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ వ్యవస్థను ఎత్తివేయొద్దని, మొబైల్ అంగన్వాడీ సెంటర్స్‌ను తీసివేయాలని, వేసవి సెలవులు ఇవ్వాలని, బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీలకు నెలకు 18 వేలు ఇస్తామని, పీఎఫ్ కల్పిస్తామని ఎన్నికల మ్యానిఫెస్టోలో చెప్పిన ప్రకారం అమలు చేయాలని కోరారు. సుప్రీంకోర్ట్ ఇచ్చిన తీర్పు ప్రకారం అంగన్వాడీ ఉద్యోగులకు గ్రాట్యుటీ అమలు చేయాలన్నారు. అంగన్వాడీ ఉద్యోగులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని, బీఎల్ఓ డ్యూటీలు రద్దు చేయాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం కలెక్టర్ హనుమంతరావుకు పలు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దాసరి పాండు, కల్లూరి మల్లేశం, అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బురుగు స్వప్న, చిలువేరు రామకుమారి, నాయకులు మాయ కృష్ణ, కొల్లూరు ఆంజనేయులు, కళ్యాణి, గంగుల రమ, పద్మ, రుక్మిణి, ప్రమీల, వసంత, సయేదా, ఉమ, జ్యోతి, శ్యామల, సునీత, సుజాత, సైదమ్మ పాల్గొన్నారు.

బడ్జెట్‌లో నిధులిచ్చేనా?

ఆశగా ఎదురుచూస్తున్న జిల్లా ప్రజలు

- ఫండ్స్ లేక కీలక ప్రాజెక్టులు పెండింగ్
- సాగునీటి ప్రాజెక్టులకు నిధుల వచ్చేనా?
- పెండింగ్‌లో కీలక రహదారుల విస్తరణ
- యాదగిరిగుట్టలో ఆగిన పనులకు మోక్షం లభించేనా?
- నేడు బడ్జెట్ ప్రవేశపెట్టనున్న ఆర్థిక మంత్రి భట్టి

నల్లగొండ ప్రతినిధి/యాదాద్రి భువనగిరి, మార్చి18(నమస్తే తెలంగాణ) : రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ వైపు ఉమ్మడి జిల్లా ప్రజలు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. నిధుల వరద, ప్రాజెక్టుల మంజూరుపై ఆశలు పెట్టుకున్నారు. గత బడ్జెట్‌లో నిరాశ మిగల్చగా, ఈ నెల 19న ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క అసెంబ్లీలో ప్రవేశ పెట్టే పద్దులోనైనా కనికరిస్తారో, లేదో చూడాల్సి ఉంది. ఉమ్మడిజిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులు, భూసేకరణ, పెండింగ్ పనులు, కీలక రహదారులు, పలు కొత్త ప్రాజెక్టులు, యాదగిరిగుట్ట ఆలయానికి నిధులతోపాటు అభివృద్ధిలో కీలకమైన అంశాల పట్ల నిధుల కేటాయింపుపై ప్రజల్లో ఉత్కంఠత నెలకొంది.

సాగునీటి ప్రాజెక్టులు

ఉమ్మడి జిల్లా పరిధిలో కీలక సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి నిధుల కేటాయింపు చాలా అవసరం ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై 15 నెలలు పూర్తయినా కీలక ప్రాజెక్టుల్లో పెద్దగా పురోగతి లేదు. కేవలం జిల్లా మంత్రుల, ఎమ్మెల్యేల మాటల్లోనే ప్రాజెక్టులను పూర్తి చేస్తామని ప్రకటనలు వినిపిస్తున్నాయి. అవి కార్యరూపం దాల్చలంటే నేటి బడ్జెట్‌లో నిధుల కేటాయింపే కీలకం. జిల్లాలో కీలకమైన ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గాన్ని వచ్చే మూడేండ్లల్లో పూర్తి చేస్తామని పదే పదే ప్రకటనలు గుప్పిస్తున్నారు. కానీ, దీన్ని పూర్తి చేసేందుకు అవసరమైన నిధులను ఏ మేరకు కేటాయిస్తారన్నది తేలాల్సి ఉంది. ఇదే తరహాలో డిండి ఎత్తిపోతల పథకాన్ని సైతం మూడేండ్లల్లో పూర్తి చేస్తామని ఇప్పటికే పలుమార్లు ప్రభుత్వ పెద్దలు ప్రకటించారు. బ్రాహ్మణవెల్లంల ఉదయం సముద్రం ఎత్తిపోతల పథకంలో కీలకమైన భూ సేకరణ, కాల్వలు, డిస్ట్రిబ్యూటరీల తవ్వకాలన్నీ పెండింగ్‌లో ఉన్నాయి. ఇక ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వతోపాటు డిస్ట్రిబ్యూటరీ కాల్వలకు కూడా లైనింగ్ చేస్తామన్న ప్రకటనలు ఉన్నాయి. వాటితోపాటు మూసీ, ధర్మారెడ్డికాల్వ, పిలాయిపల్లి కాల్వల పనులకు నిధులు అవసరం ఉన్నాయి. ఇక సాగర్ ప్రాజెక్టు, ఎడమకాల్వ మరమ్మతులు, దానిపై లిఫ్టుల నిర్వహణ తదితర అంశాలకు నిధుల విషయం తేలాల్సి ఉంది. జిల్లాకు చెందిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నీటి పారుదల శాఖ మంత్రిగా ఉండడంతో నిధుల కేటాయింపుపై ఆసక్తి నెలకొంది.

యాదగిరిగుట్ట పనులకు నిధులిచ్చేనా..?

రాష్ట్రంలోని ప్రముఖ ఆలయాల్లోనే యాదగిరిగుట్ట ఒకటి. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత సుమారు రూ.1,200 కోట్లతో నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలయాన్ని అద్భుతంగా పునర్నిర్మించారు. ఏటా బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తూ ఎప్పటికప్పుడు ప్రాధాన్య క్రమంలో పెండింగ్ పనులు పూర్తి చేసేందుకు కృషి చేశారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక నిధుల కొరతతో పనులు ముందుకు సాగడం లేదు. కొండ కింద వైకుంఠ ద్వారం సమీపంలో గల ఆర్య వైశ్య సత్రం నుంచి ఎంట్రీ ఫ్లైఓవర్ కోసం నెట్ వర్క్ బ్రిడ్జిని నిర్మాణం చేపట్టారు. ఇందులో 7 ఫిలర్లు, 32 మీటర్ల మేర నిర్మాణం పూర్తయింది. లండన్ నుంచి దిగుమతి చేసుకున్న నెట్ వర్క్ ఆర్చ్ బ్రిడ్జిని బిగించాల్సి ఉంది. రూ.69 కోట్లలో రూ.34కోట్లు మంజూరు చేయగా రూ.20కోట్లు ఖర్చు చేశారు. మరో రూ.14 కోట్లు కావాలి. రూ.290కోట్లతో యాదగిరిగుట్ట నుంచి రాజాపేట మీదుగా చేర్యాల వరకు సుమారు 37 కిలోమీటర్లు, యాదగిరిగుట్ట నుంచి వంగపల్లి వరకు సుమారు 5 కిలోమీటర్ల ఫోర్ లేన్ బీటీ రోడ్డు చేపట్టాల్సి ఉంది. ఇంకా అనేక పనులు పెండింగ్‌లో ఉన్నాయి.

బస్వాపూర్ కు రూ.500కోట్లు అవసరం..

రైతుల తలరాతను మార్చే బస్వాపూర్ ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం గాలికి వదిలేసింది. తుది దశకు వచ్చిన ఈ ప్రాజెక్టుకు పట్టించుకుంటే యాదాద్రి భువనగిరి జిల్లాతోపాటు నల్లగొండలోని కొన్ని మండలాలకు సాగునీరు అందుతుంది. ఈ ప్రాజెక్ట్ కు తక్షణం రూ.500 కోట్లు కావాలని నీటి పారుదల శాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. ఇటీవల 50 కోట్లు విడుదల చేయగా, సరిపోవని పెండింగ్‌లో పెట్టారు. నిధులను వినియోగించకపోవడంతో ఇతర అవసరాలకు మళ్లించినట్టు తెలుస్తున్నది. నిధులు వస్తేనే ముంపు గ్రామం బీఎన్ తిమ్మాపూర్ గ్రామాన్ని ఖాళీ చేసే అవకాశం ఉంటుంది. తుర్కపల్లి మండలంలో ఉన్న గంధమల్ల రిజర్వాయర్‌కు సంబంధించి గతంలోనే ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య హామీ ఇచ్చారు. ప్రాజెక్ట్ సామర్థ్యాన్ని కుదించినా ఇప్పటి వరకు అడుగు ముందుకు పడలేదు. ఇక వృథాగా పోతున్న మూసీ జలాలను సద్వినియోగం చేసుకుని ఆయకట్టును మరింత స్థిరీకరించేందుకు ఉద్దేశించిన భువనగిరి నియోజకవర్గంలోని ధర్మారెడ్డి, పిల్లాయిపల్లి, బునాదిగాని కాల్వల ఆధునికీకరణ ఊసే లేదు. గతేడాది పిల్లాయిపల్లి కాల్వకు రూ.86 కోట్లు, ధర్మారెడ్డిపల్లికి రూ.124 కోట్లు, బునాదిగాని కాల్వకు 266 కోట్లు పరిపాలన అనుమతులు ఇచ్చింది. నిధులు విడుదల కావాల్సి ఉంది.

మరికొన్ని డిమాండ్లు ఇవి..

- ఆలేరును రెవెన్యూ డివిజన్ చేయాలనే డిమాండ్ కలగానే మారుతున్నది.
- చండూరు పోలీస్ సబ్‌డివిజన్ ఏర్పాటు పెండింగ్‌లోనే ఉంది.
- భువనగిరి, చౌటుప్పల్‌లో ఆర్టీసీ డిపో ఏర్పాటుకు చర్యలు తీసుకోవాల్సి ఉంది.
- హైదరాబాద్‌కు దగ్గరలో ఉన్న భువనగిరిలో ఐటీ హబ్ ఏర్పాటు హామీ అమలుకు నోచలేదు.
- జిల్లాకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు ఒక్కటీ మంజూరు చేయలేదు.
- కొలనుపాక బ్రిడ్జి, మూసీ బ్రిడ్జికి నిధులు అవసరం.

కీలక రహదారులకు మోక్షం కలిగేనా?

భువనగిరి–చిట్యాల, నల్లగొండ–దేవరకొండ, చండూరు–ఘట్టుప్పల్–నారాయణపురం తదితర కీలక రహదారులు విస్తరించాల్సి ఉంది. కానీ విస్తరణకు నోచకపోవడంతో రోజూ ఈ రోడ్లపై ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. వీటిపై ఇప్పటికే జిల్లాకు చెందిన ఆర్‌అండ్‌బీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పలుమార్లు ప్రకటనలు చేశారు. వీటిని పూర్తి చేయాలంటే అందుకు తగ్గట్టుగా ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించాల్సిన అవసరం ఉంది. చిట్యాల–భువనగిరి రహదారి విస్తరణ టెండర్ ప్రక్రియ జనవరి 2024లోపు పూర్తి చేయిస్తానని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రకటించినా ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదు. ఇంకా జిల్లాలో పలు కీలక లింక్ రహదారుల విస్తరణ కూడా జరుగాల్సి ఉంది.

సాగు నీటి ప్రాజెక్టులకు నిధులివ్వాలి

జిల్లాలో కీలక ప్రాజెక్టులు పెండింగ్ లో ఉన్నాయి. కేసీఆర్ హయాంలో తీసుకొచ్చిన బస్వాపూర్ తుది దశకు చేరుకుంది. ఇప్పటికే ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ పూర్తయ్యింది. నిధులిస్తే జిల్లా సస్యశ్యామలం అవుతుంది. బునాదిగాని కాల్వ, ధర్మారెడ్డిపల్లి, పిల్లాయిపల్లి కాల్వలకు నిధులు విడుదల చేయాలి.

- కంచర్ల రామకృష్ణారెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు